నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

పెద్దమ్మగుడిలో చండీహోమం

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని కేపీ-జగన్నాథపురం గ్రామాల మధ ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం యాగశాలలో శనివారం అర్చకులు చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, వేదమంత్రాలతో ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజల అనంతరం చండీహోమం నిర్వహించారు. ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహీపతి రామలింగం, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

తప్పు నా సామి రంగ

సత్తుపల్లి కేంద్రంగా 'మట్టి' రవాణా దందా

- అక్రమార్కులకు రాజకీయ నేతల దన్ను
- 'మామూలు'గా తీసుకుంటున్న యంత్రాంగం
- అరకొరగా దాడులు.. ఒకటీ రెండు కేసులు

టిప్పర్‌లో మట్టి లోడ్ చేస్తున్న యంత్రాలు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 24: సత్తుపల్లి ప్రాంతంలో కొందరు వ్యాపారుల మట్టి తోలకాల దందా మూడు పూవులు.. ఆరు కాయలుగా సాగుతున్నది. అక్రమార్కులంతా సిండికేట్‌గా, మాఫియాగా ఏర్పడి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు అంటీముట్టనట్లుగా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు రెండు సిండికేట్లుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేస్తుండడంతో పోలీసులు హడావుడిగా వెళ్లి దాడుల చేస్తున్నారు. అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి వాటిని రెవెన్యూశాఖ అప్పగిస్తున్నారు. రెవెన్యూశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో వాహనాలను విడిచిపెడుతున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

పట్టణంలో ఒక ఇల్లు కట్టాలన్నా, స్థలం చదును చేయించుకోవాలన్నా మట్టి అత్యవసరమైంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు సరైన ధ్రువపత్రాలు లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లను సమకూర్చుకుని, అధికారుల చేతులు తడిపి మట్టి తోలకాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి వేసి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారంటున్నారు. వారు రేజర్ల, కొత్తూరు నుంచి భారీ స్థాయిలో మట్టి రవాణా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ట్రాక్టర్ మట్టికి రూ.600, టిప్పర్‌కు రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నారని, రాజకీయ నాయకులు తమకూ భాగస్వామ్యం కావాలని ఒత్తిడి చేస్తుండడంతో అక్రమార్కులు ట్రాక్టర్ మట్టికి రూ.వెయ్యి, టిప్పర్‌కు రూ.3 వేల దాకా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

రాజకీయ నేతలకూ భాగస్వామ్యం..

పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు తరచూ దాడులు నిర్వహించి వాహనాలతోపాటు మట్టిని సీజ్ చేస్తున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో కేసులను ఎత్తివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే కోవలో ఇటీవల పోలీసులు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూశాఖకు అప్పగించినప్పటికీ ఆ శాఖ ఓ రాజకీయ నేత ఒత్తిడితో పోలీసులు కేసులు ఎత్తివేసినట్లు సమాచారం. అలాగే జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు సత్తుపల్లి ప్రాంతంలో దాడులు నిర్వహించారు. మూడు టిప్పర్లను స్వాధీన పరచుకున్నారు. వాటిని ఆర్టీసీ డిపోలో ఉంచారు. కానీ అసలు టిప్పర్లలో మట్టిని నింపిన యంత్రాలను విడిచిపెట్టడం గమనార్హం.

మితిమీరిన వేగం..

ఇసుకను తరలిస్తున్న డ్రైవర్లు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణాకు కాలం చెల్లిన వాహనాలు ఉపయోగిస్తున్నారని, కొందరు లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతున్నారని ఆరోపిస్తున్నారు. రవాణాను కట్టడి చేయాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారని, ఇప్పటికైనా అక్రమార్కులను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులు పట్టుకుని వదిలేసిన టిప్పర్లు (ఫైల్)

అధికారులు ఏమన్నారంటే..

మట్టితోలకాలపై సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వరరావును 'నమస్తే' వివరణ కోరగా మట్టి తోలకాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సిబ్బంది కొరతతో దాడులు చేయలేకపోతున్నామని సమాధానమిచ్చారు. మైనింగ్‌శాఖ అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. అలాగే సత్తుపల్లి సీఐ కిరణ్‌ను వివరణ కోరగా.. పోలీస్ సిబ్బంది అనేక సార్లు దాడులు చేసి కొన్ని టిప్పర్లను స్వాధీనం చేశామని, అనంతరం వాటిని రెవెన్యూశాఖకు అప్పగించామని సమాధానమిచ్చారు.

బీఆర్ఎస్ కృషితోనే జిల్లా రైల్వేస్టేషన్ల అభివృద్ధి

రేపు పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

జిల్లాలోని రైల్వే సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించా: ఎంపీ నామా

ఖమ్మం, ఫిబ్రవరి 24: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ ఎంపీలుగా పార్లమెంటులో తాము చేసిన కృషి ఫలితంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాంతో పాటు ప్రధానిని, రైల్వే మంత్రులను, ఇతర కేంద్ర మంత్రులను కలిసి వారితో చర్చించి లేఖలు అందించిన ఫలితంగానే జిల్లాలో పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. అలాగే, కొత్త రైల్వే మార్గాలు, ఆర్వోబీలు, ఆర్యూబీ, అండర్‌పాస్‌లు నిర్మితమయ్యాయని వివరించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ముత్యాలగూడెం, మీనవోలు అండర్‌పాస్ , కొత్తగూడెం రోడ్ ఓవర్ బ్రిడ్జి, డోర్నకల్ - పాపటపల్లి రోడ్ అండర్ పాస్, మధిర - మోటమర్రి, ఎర్రుపాలెం - తొండల గోపవరం రోడ్ అండర్‌పాస్‌లు రూపుదిద్దుకున్నాయని అన్నారు. ఈ క్రమంలో వీటిల్లో పలు అభివృద్ధి పనులను ఈ నెల 26న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాలో అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం, కొత్తగూడెం, మణుగూరు తదితర రైల్వే స్టేషన్ల పురోభివృద్ధికి బీఆర్ఎస్ ఎంపీగా తాను ఎంతో కృషి చేశానని, ముఖ్యంగా ఖమ్మం రైల్వేస్టేషన్ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడ్డానని వివరించారు. భద్రాచలం - కొవ్వూరు రైల్వేలైన్ కోసం పార్లమెంట్ లో మాట్లాడడంతోపాటు 125 లేఖలు రాసినట్లు గుర్తుచేశారు.

'ఇంటూరి'ని కలిసిన ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే సంద్ర

ఇంటూరిని కలిసి బయటకు వస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24: ఇటీవల ఓ కేసులో అరెస్ట్ అయి జిల్లా జైలులో రిమాండ్ ఖైదులో ఉన్న ఇంటూరి శేఖర్‌ను శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సంద్రా వెంకటవీరయ్య కలిశారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వారి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిస్తా

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

చర్ల, ఫిబ్రవరి 24: పేద ప్రజలకు మెరుగైనసేవలు అందించడమే ధ్యేయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. శనివారం చర్ల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అడబిడ్డలకు పెళ్లికోసం ఆర్థిక చేయూత ఇచ్చందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి పేదంటి తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నియోజక ప్రజలకు ఎల్లప్పుడూ సేవలు అందిస్తానన్నారు. రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఆలస్యం కాకుండా త్వరితగతిన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గీద కోదండ రామయ్య, జడ్పీటీసీ ఇర్సా శాంత, తహసీల్దార్ యం శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాములోరికి వైభవంగా సహస్ర కలశాభిషేకం

నేటినుంచి నిత్యకల్యాణం పునఃప్రారంభం

సీతారామ, లక్ష్మణమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 24 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని సహస్ర కలశాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం అంతరాలయంలోని మూలవరులకు సువర్ణ తులసి పూజలు నిర్వహించి బేడా మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారికి సహస్ర కలశాలతో అభిషేకం చేశారు. వేదపండితుల పంచ ఉపనిషత్తు మంత్రాలతో సీతారామ, లక్ష్మణమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఏకోత్తర సహస్ర కలశాభిషేకంలో భాగంగా ద్రవ్య కలశములు, శుద్ధోదకములు, ఇక్షోదకములు, ఫలోదకం, వర్షోదకం, లవణోదకం, గోదావరి మధ్య భాగములో 500 నదులు కలిసిన గంగా తీర్థమును మధ్య కలశములోకి శ్రీరామచంద్ర మహాప్రభువుల వారిని ఆవాహన చేసి ఆ తీర్థాన్ని అంతరాలయంలోని మూలమూర్తులకు ప్రోక్షించారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతిని నిర్వహించారు. ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి నేతృత్వంలో 28 మంది ఋత్విక్కులు నీరాట్టం పఠించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుల వార్షిక కల్యాణం

భద్రాచలం రంగనాయకుల గుట్టపై రంగనాథస్వామి వార్షిక కల్యాణాన్ని దేవస్థానం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం చేసి మధ్యాహ్నం 12గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల వేడుక, మంగళాష్టకం తదితర కార్యక్రమాలతో కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు.

విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధ తీసుకోవాలి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 24: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైమరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సీఆర్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన బాలబాలికలు ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు పిల్లలందరికీ వచ్చేలా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో పాటు పిల్లలందరికీ తెలిసేలా ఎస్సీఆర్సీలు కృషి చేయాలని అన్నారు. జీపీ స్కూల్స్ ఉపాధ్యాయులకు మూడు డివిజన్లలో ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని, రెండు నెలల్లో తెలుగులో వాక్యాలు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎస్సీఆర్సీలు పర్యవేక్షణ చేసి రిపోర్టు సమర్పించాలన్నారు. సమావేశంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఎస్సీ ఆర్సీలు రమేష్, బిఖ్య, వెంకటరత్నం, జయప్రకాష్, రామారావు, ప్రసాద్, మోతీలాల్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా సిద్ధం

ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 24: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా సిద్ధమైందని, జిల్లావ్యాప్తంగా 115 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్నామని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 76,869 మంది ఓటర్లలో పురుషులు 46,556 మంది, మహిళలు 30,309 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే, మార్చి 14 లోపు రెవెన్యూ కార్యాలయాల్లో తెలియజేయాలన్నారు. ఓటు హక్కు కోసం నమోదు చేసుకోని అభ్యర్థులు మార్చి 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో గణేష్, ఇన్‌చార్జి డీఆర్వో రాజేశ్వరి, ఎన్నికల విభాగ డీటీ రాంబాబు, వివిధ పార్టీల నాయకులు గోపయ్య, రాజయ్య, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్, పున్నయ్య పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు మావోయిస్టు మృతి

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 24: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో ఓ మావోయిస్టు మృతిచెందాడు. సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. దండకారణ్యంలోని బుర్కలంక అటవీప్రాంతంలో డీఆర్జీ భద్రతా దళాలు శుక్రవారం రాత్రి నుంచి మావోయిస్టుల కోసం సెర్చింగ్ ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాల పాటు భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పరారయ్యారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించారు. మావోయిస్టులకు సంబంధించిన పేలుడు పదార్థాలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

వలస కూలీల ముసుగులో మావోయిస్టు దళ సభ్యులు ?

నలుగురిని అదుపులోకి తీసుకున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: వలస కూలీల ముసుగులో భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలానికి వచ్చిన నలుగురు మావోయిస్టు పార్టీ దళ సభ్యులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తెలిసిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని దండాకారణ్యంలో మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న కొందరు వలస కూలీలుగా భద్రాది జిల్లాకువచ్చారని సమాచారం అందుకున్న అక్కడి పోలీసులు ఇటీవల జూలూరుపాడు మండలానికి వచ్చారు. స్థానిక పోలీసులతో కలిసి వారు మండలంలోని అనంతారం, గంగారంతండా, గుండెపుడి గ్రామాలను జల్లెడ పట్టినట్లు సమాచారం. వలస కూలీల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి, సరైన ఆధారాలు లేని నలుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. పట్టుబడిన నలుగురు వ్యక్తులూ మావోయిస్టు దళ సభ్యులు అని సమాచారం. ప్రస్తుతం ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది.

గ్రాడ్యుయేట్ ఓటర్లు 4,27,289

- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ

నల్లగొండ, ఫిబ్రవరి 24 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితాను నల్లగొండ జిల్లాకలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన శనివారం ప్రచురించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 12 జిల్లాల్లో ఇప్పటి వరకు 4,27,289 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,66,622 మంది పురుషులు, 1,60,661మంది మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు ఉన్నారు. జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీకి రాజీనామా చేయగా తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు గానూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఈ నెల 6 వరకు గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటి వరకు 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటే మార్చి14వరకు తెలియ జేయాలని కలెక్టర్ హరిచందన సూచించారు. శనివారం విడుదల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాలతోపాటు ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాలు, నియోజకవర్గంలోని గుర్తించిన 600 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను మార్చి 14వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్లు
సిద్దిపేట	5	4,412
జనగాం	27	21,870
హనుమకొండ	67	39,167
వరంగల్	59	40,250
మహబూబాబాద్	36	32,622
ములుగు	17	9,532
భూపాలపల్లి	16	11,814
భద్రాద్రి కొత్తగూడెం	55	36,926
ఖమ్మం	115	76,869
యాదాద్రి భువనగిరి	37	31,778
సూర్యాపేట	71	47,465
నల్లగొండ	95	74,584
మొత్తం	**600**	**4,27, 289**

అట్టడుగుకు పాలేరు నీటిమట్టం

- తాగునీటికి మరో పది రోజులకు మాత్రమే జలాలు
- ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజల డిమాండ్

అడుగంటిన పాలేరు జలాశయం

కూసుమంచి, ఫిబ్రవరి 24: పాలేరు రిజర్వాయర్‌లో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో జలాలు నిండుకోవడంతో దిగువన నీటి ఎద్దడి ఏర్పడింది. 10 సంవత్సరాల కింద వచ్చిన సాగునీటి ఇబ్బందులు మరోసారి ఉత్పన్నమయ్యాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా శనివారం నీటి మట్టం 13.5 అడుగుల మేరకు ఉంది. ఇప్పుడు ఉన్న నీటి నిల్వలు మరో 10 రోజుల అవసరాలకు మాత్రమే ఉపయోగపడే అవకాశం ఉంది. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకానికీ జలాలు సరఫరా చేయలేని దుస్థితి. వచ్చేది వేసవి కావడంతో మున్ముందు నీటి అవసరాలు మరింత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదు. ఆయా జిల్లాలకు ఒక్కరోజు శుద్ధజలం సరఫరా చేయాలంటే ప్రాజెక్ట్‌లో 126.5 క్యూసెక్కుల నీరు ఉండాలి. కానీ మున్ముందు అన్ని క్యూసెక్కుల నీరు అందడం దుర్లభం. ఇప్పటికే సాగర్ ఆయకట్టులో సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. ఎగువ నుంచి ఒకటి రెండు తడులకు నీరు విడుదలైతే తప్ప పంటలు చేతికందలేని దైన్యం. అలాగే జలాశయంలో ఉన్న నీరు ఆవిరయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లేమైనా చేస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించే అవకాశం లేదు. దీనిపై ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వం ఇప్పటికే నీటి ఎద్దడిపై సమీక్షలు నిర్వహించిందని, ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశపై మరింత స్పష్టత రావాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రజల తాగునీటి కష్టాలు తీరాలంటే రాష్ట్రప్రభుత్వం శ్రీరాంసాగర్ నుంచి జలాలను మళ్లించి పాలేరు జలాశయానికి తీసుకురావాల్సిందే. లేదా కేఆర్ఎంబీ అనుమతులు తీసుకుని సాగర్ నుంచి జలాశయానికి నీరు తీసుకోవాలి. సర్కార్ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాల్సిందే.

పాలేరు ఇన్‌టేక్ వెల్